క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో ప్రతిష్టా మహోత్సవం


భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్న రాజుపాళెం సుబ్బారెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని జి.అప్పాయపల్లెలో నూతనంగా నిర్మించిన సీతా రామాలయం ప్రతిష్ట మహోత్సవాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి 300 మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాజారెడ్డి, వైస్ సర్పంచ్ సురేష్‌యాదవ్, చేతన్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జేవీకే మండల స్టాక్ పాయింట్ పరిశీలన


జేవీకే కిట్లను పరిశీలిస్తున్న అకడమిక్ మానిటరింగ్ అధికారులు

చక్రాయపేట : మండలంలోని గండి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే మండల స్టాక్ పాయింట్‌ను అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ ధనలక్ష్మి, అల్టర్నేట్ స్కూలు కో ఆర్డినేటర్ సురేష్‌బాబులు సందర్శించి జేవీకే కిట్ల నాణ్యతను పరిశీలించారు. అలాగే మండల స్టాక్ పాయింట్ నుంచి స్కూలు పాయింట్‌కు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవినాయక్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

వేంపల్లె : పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆవోపా మండల అధ్యక్షుడు పి.గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. కడపకు చెందిన సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ కె.శేషఫణి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హుస్సేన్ బాషాకు డాక్టరేట్



పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో హ్యుమ్యానిటీ నిష్టలో సేవలు అందిస్తున్న ఎస్.హుస్సేన్ బాషా ప్రఖ్యాత మేవార్ యూనివర్శిటీ నుంచి మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. 'దేశంలో ప్రముఖ ఆరోగ్య రంగ విభాగాలపై వర్కింగ్, క్యాపిటల్ యొక్క సామర్థ్యం' అనే అంశంపై హుస్సేన్‌బాషా పరిశోధనలు కొనసాగించారు. ఈ పరిశోధనలు డాక్టర్ సీహెచ్ అగర్వాల్, డాక్టర్ రేఖ శర్మ పర్యవేక్షణలో చేశారు. రోజు రోజుకు మారుతున్న అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా కరోనా వంటి గ్లోబెల్ ప్యాండమిక్‌లను బట్టి దేశంలో ఆసుపత్రి రంగంలో గణనీయమైన పెట్టుబడి, వ్యయాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నట్లు ఈ పరిశోధనలో తేలింది. ఇటువంటి ప్రతిష్టాత్మక డిగ్రీ అవార్డు వచ్చినందుకు కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, హెచ్‌ఓడీ సాంబయ్య, అధ్యాపకులు డాక్టరేట్ పొందిన హుస్సేన్ బాషాను అభినందించారు.

ఉపాధి హామీ పనితో కూలీలకు ఉపశమనం


చిలంకూరులో పనులను పరిశీలిస్తున్న ఏపీఓ నాగసులోచన

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వేసవిలో జరుగుతున్న ఉపాధి పనులతో కూలీలకు ఉపశమనం కలుగుతోందని ఉపాధి హామీ పథకం ఏపీఓ నాగసులోచన తెలిపారు. శనివారం మండల పరిధిలో పలు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో ప్రతి రోజు 2 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయాన్నే పనులకు కూలీలు వస్తున్నారన్నారు. ప్రస్తుతం పనులు అన్ని గ్రామ పంచాయతీలలో జరుగుతున్నాయన్నారు.

చీనికి తెగుళ్లు.. నష్టాల బాటలో రైతులు

సింహాద్రిపురం : జిల్లాలోనే చీనీ సాగులో సింహాద్రిపురం మండలం మొదటి స్థానంలో ఉంది. గతంలో వర్షాలు పడక నీరు లేక చీనీ చెట్లు దెబ్బతిన్నాయి. ఈ ఏడాదిలో వర్షాలు అధికమై తెగుళ్లతో చీనీ చెట్లు చనిపోతున్నాయి. దీంతో చీనీ రైతులు నష్టాలలో కూరుకుపోతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలు పడి ఏళ్ల తరబడి కంటికి రెప్పలా పెంచుకున్న చీనీ చెట్లకు తెగుళ్లు సోకి ఎండిపోయి క్షీణిస్తుండటంతో చేసేదేమిలేక రైతులు ఎండిన చీనీ చెట్లను నరికివేస్తున్నారు. మరో పక్క తెగుళ్ల బారిన పడకుండా చీనీ చెట్లకు అంతంత మాత్రంగా ఉన్న చీనీ కాయలకు మొగలి తెగులు దెబ్బకు కాయలకు మచ్చలు ఏర్పడ్డాయి. దీంతో చీనీ కాయల ధరలు కూడా పతనం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. చీనీ కాయలకు మచ్చలు రావడంతో వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు. మరో పక్క వేరుకుళ్లు, బంక తెగులు, పులుసు పురుగు తెగుళ్లతో చీనీ చెట్లు నశించి క్షీణించిపోతున్నాయని చీనీ రైతులు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన చీనీ రైతులకు ప్రభుత్వం పంటల బీమాతోపాటు నష్టపరిహారం, ఉపాధి హామీ పథకం కింద చీనీ మొక్కలను ఉచితంగా అందించి చీనీ రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.


హిమకుంట్లలో తెగుళ్లతో ఎండిన చీనీ చెట్లు


చీనీ చెట్లను కొట్టివేయడంతో మోడుబారిపోయిన తోట

ప్రభుత్వమే ఆదుకోవాలి..



నా పొలంలో చీనీ పంట సాగు చేశా. వర్షాలు అధికమై తెగుళ్లు సోకి చీనీ చెట్లు చనిపోతున్నాయి. కాపు రాలిపోయి ఎండుదశకు చేరుకోవడంతో చేసేదేమిలేక 18 ఏళ్లు కన్నబిడ్డల్లా కాపాడిన చీనీ చెట్లను కొట్టేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. నష్టపోయిన చీనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- వెంకటరాములు (చీనీ రైతు), హిమకుంట్ల

చేసేదేమీలేక..



నాకు 5 ఎకరాలు ఉండగా.. రెండు ఎకరాలలో చీనీ పంటను సాగు చేశా. అధిక వర్షాలతో చీనీ చెట్లకు తెల్ల పులుసు, తెగుళ్లతో చీనీ చెట్లు కాయలతో చనిపోతున్నాయి. చేసేదేమిలేక చీనీ చెట్లను కొట్టేసుకున్నా. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన చీనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- వెంకటనారాయణరెడ్డి (చీనీ రైతు), గురిజాల

శాస్త్రవేత్తలు సూచించిన మందులు వాడండి



మండలంలోని అధిక వర్షపాతంవల్ల తెగుళ్లబారిన పడి చీనీ చెట్లు చనిపోతున్నాయి. చనిపోయిన చీనీ చెట్లను శాస్త్రవేత్తలు పరిశీలించారు. తెగుళ్ల నివారణకు ట్రైకోడర్, సూడోమోనార్స్ మందులను రెండు వారాలలో రెండుసార్లు, చీనీ చెట్ల చుట్టూ గాడి తీసి మందులను పోసుకుంటూ చీడలన నివారించి చీనీ చెట్లను కాపాడుకోవాలి.

- మల్లేశ్వరరెడ్డి (హెచ్ఓ), ముద్దనూరు

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని శిల్పారామంలో రెండు రోజులు నిర్వహించిన ఫ్యాషన్ షో ఆడిషన్ అందరిని ఆకట్టుకుంది. అందులో భాగంగా శనివారం ఫ్యాషన్ షో ముగింపు కార్యక్రమంలో 20 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ ఫ్యాషన్ షోలో మొదటి విజేతగా నందిని, బెస్ట్ పర్సనాలిటీ అవార్డు జగదీష్, బెస్ట్ వాకప్ అవార్డు మోక్షత్, బెస్ట్ హ్యాండ్సమ్ అవార్డు మోస దక్కించుకోగా.. ఈ పోటీలలో డ్యాన్సర్స్, సింగర్స్‌కు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఫ్యాషన్ డిజైనర్స్ కోమల, సంతోష్, హబీబ్, శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని సంగాలపల్లె గోశాల, వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలో ఎన్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయం, సాయిబాబా ఆలయంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల హెచ్ఎం బదిలీ

తొండూరు : స్థానిక బాలయోగి గురుకుల పాఠశాల హెడ్మాస్టర్ తులశమ్మ శనివారం ప్రొద్దుటూరు రాజుపాలెం వెల్లాల బాలయోగి గురుకుల పాఠశాలకు బదిలీ అయ్యారు. ఐదేళ్లుగా తొండూరులో గురుకుల పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని పాఠశాల సిబ్బంది తెలిపారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పని చేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన పోటీలు

వేంపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణం వలన కలిగే మార్పులు, లాభాలు, పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై గ్రామాల్లో ఉన్న వారికి అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యోగాంజనేయులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం క్విజ్ పోటీలకు విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుళరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు పరిహారం అందజేస్తాం

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాలకు ఎన్నికల ముందు రూ.3.25 లక్షలు ముంపు పరిహారం అదనంగా ఇస్తామని చెప్పిన మాట ప్రకారం పరిహారం చెల్లిస్తామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం కొండాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రజలతో ఆయన మాట్లాడారు. గండికోట ప్రాజెక్టు కింద గత ప్రభుత్వం రూ.6.75 లక్షలు పరిహారం 14 గ్రామాలకు ఇవ్వడంతో నిర్వాసితులు అదనంగా పరిహారం ఇవ్వాలని కోరగా ఇస్తామని చెప్పిన మాట ప్రకారం 14 గ్రామాలకు రూ.3.25 లక్షలు ఇస్తున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వాసితుల బ్యాంకు ఖాతా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని ఆన్‌లైన్‌లో నిర్వాసితుల జాబితా పూర్తి చేసిన తర్వాత పరిహారం ఇస్తామన్నారు. కార్యక్రమంలో చింతారాజారెడ్డి, కొండు వాసుదేవారెడ్డి, నీలకంఠరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండు వినోద్‌కుమార్‌రెడ్డి, చోటు, సాయి తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : మండలంలోని చినుమాచుపల్లె దళితవాడకు చెందిన గద్దె నాగేంద్రకుమార్(45) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ సమాచారాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన చారిటబుల్ ట్రస్ట్ పోచిమరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు శనివారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాలు సుబ్బారావు, అచ్చొలి బుజ్జిరెడ్డి, మద్దిక నాగమునిరెడ్డి, మాదినెని చంటి, మాదినెని శ్రీనివాస్ పాల్గొన్నారు.

5న ఆలయ ప్రథమ వార్షికోత్సవం

చెన్నూరు : స్థానిక అరుంధతినగర్‌లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను ఈనెల 5వ తేదీ సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కొండూరు ఓబులేసు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 6 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణలు, 7 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం, ఉదయం 10 గంటలకు వేద పండితులచే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, 12 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం ఉంటుందన్నారు.

పురాతన ఆలయానికి మహర్దశ

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి పురాతన ఆలయానికి మహర్దశరానుంది. సుమారు 600 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని రూ.64 లక్షల టీటీడీ నిధులతో అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి 5 రోజుల పాటు సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు ఏర్పా ట్లు పూర్తి చేశారు. గాలిగోపురం, విమాన గోపురం జీర్ణమై శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో నూతనంగా గాలిగోపురం, విమాన గోపురంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన నిధుల మంజూరు చేయించారు.

సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయల పంపిణీ


రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న అధికారులు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తోందని వేంపల్లె మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని 5వ రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, మార్కెట్ యార్డు మెంబర్ రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఏఓ రాజేంద్రప్రసాద్‌ల ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వేరుశనగ విత్తన కాయల పూర్తి ధర క్వింటా రూ.9300లు కాగా 40 శాతం సబ్సిడీపోనూ రూ.5,500 మాత్రమే రైతులు చెల్లించాలన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా ఆర్‌బీకేలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే చేనేతలు అభ్యున్నతి చెందారు


చేనేత కార్మికులతో మాట్లాడుతున్న చంద్రమౌళి

ముద్దనూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేనేత కార్మికులు అభ్యున్నతి చెందారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి అన్నారు. శనివారం మండలంలోని యామవరం గ్రామంలో చౌడేశ్వరి ఆలయంలో గ్రామ చేనేత కార్మికులు, కళాకారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ నేతన్న నేస్తంతో ఆర్థిక తోడ్పాటు లభిస్తోందని, ప్రతి చేనేత కార్మికునికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. స్థానిక నేత కార్మికులు తమకు గుర్తింపు కార్డులు, బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు అందేలా చూడాలని ఆయన కోరారు.

వాహనాలకు లైసెన్స్‌లు తప్పనిసరి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రోషన్

సింహాద్రిపురం : స్థానిక హిమకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఎస్ఐ రోషన్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి తప్పనిసరిగా వాహన పత్రాలు ఉండాలని.. అలాగే వాహనం నడుపుతున్న వ్యక్తి లైసెన్స్ కలిగి ఉండాలని లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పత్రాలు, లైసెన్స్‌లు లేని వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హాజీబాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం 85 శాతం పూర్తి

మండలం	ఓటర్లు	అనుసంధానం	మిగిలినవి
జమ్మలమడుగు	63137	56,693	6444
మైలవరం	32,956	30,779	2177
పెద్దముడియం	25,267	23,112	2155
కొండాపురం	36,066	28,230	7836
ముద్దనూరు	27,172	25,058	2114
ఎర్రగుంట్ల	60,729	51,902	8827
మొత్తం	2,45327	2,15774	29553

జమ్మలమడుగు : నియోజకవర్గంలో ఓటుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ మొత్తం 85 శాతం వరకు పూర్తి కాగా అందులో మైలవరం మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఈ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గత మార్చి వరకు సమయం కేటాయించింది. అయితే అనుసంధానం ప్రక్రియ తప్పని సరి కాదని ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి తన ఓటును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం గడువు పూర్తైనా ప్రక్రియ మాత్రం కొనసాగుతూనే ఉంది. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 85 శాతం మంది ఓటర్లు తమ ఓటుకు ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకున్నారు. మైలవరం మండలం ఓటుకు ఆధార్ అనుసంధానంలో మొదటి స్థానంలో నిలిచింది. మైలవరం మండలంలో మొత్తం 32,956 మంది ఓటర్లు ఉండగా అందులో 30,779 మంది ఓటర్లు తమ ఓటుకు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారు. గ్రామాలలో ఉన్న బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ఆధార్ కార్డుల వివరాలను సేకరించి ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు.

ఓటర్లు సహకరించాలి..

కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా కచ్చితంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఓటరుకు ఆధార్‌కార్డు అనుసంధానం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటి వరకు 85 శాతం వరకు ఓటర్ల ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయడం జరిగింది. ఓటు కలిగిన ప్రతి ఒక్కరికి ఒక్కటే ఓటు హక్కు ఉంటుంది. ఓటర్లు సహకరించాలి.

జి.శ్రీనివాసులు, ఆర్డీఓ, జమ్మలమడుగు

చేనేతలకు భరోసా ఇచ్చింది సీఎం వైఎస్ జగనే


లబ్ధిదారురాలికి మగ్గం జాకాట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్రంలో చేనేత కార్మికులకు భరోసా ఇచ్చింది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మోరగుడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో చేనేత కార్మికులకు జాకాట్, మగ్గాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన జిల్లా జౌళిశాఖ ఏడీ భీమయ్య అధ్యక్షతన నిర్వహించి మాట్లాడారు. చేనేత కార్మిక రంగానికి మొదటగా నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు, ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మాత్రమే పెద్దపీట వేశారన్నారు. చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ అందజేశారన్నారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్ చేనేత నేస్తం పథకం కింద ప్రతి ఏడాది రూ.24 వేలు చేనేత కార్మికుల ఖాతాలలో జమచేస్తున్న ఏకైన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు చేనేత కార్మికుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అనంతరం ఆర్డీఓ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ చేనేత కార్మికులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేటందుకు సొంతంగా మగ్గం ఉండేవిధంగా ప్రభుత్వం సబ్సిడీతో మగ్గాలను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిత, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బడిగించల విజయలక్ష్మి, రమేష్, నిరంజన్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే


కొక్కరాయపల్లెలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి శివకుమార్‌రెడ్డి

చెన్నూరు : మండలంలోని కొక్కరాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష (ఇళ్లు, నివాస స్థలాల సర్వే) పథకం కింద సర్వే నిర్వహించి అక్కడి ప్రజలకు శాశ్వత హక్కు కలిగించి భూ హక్కు పత్రాలను అందజేస్తున్నామని కార్యదర్శి శివకుమార్‌రెడ్డి తెలిపారు, శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొక్కరాయపల్లె గ్రామ కంఠములోని ఇళ్లకు యజమాన్య హక్కులు కల్పించేందుకు సమగ్ర సర్వే నిర్వహించి రికార్డులు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్ అలాగే గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేసుకుని డ్రాఫ్ట్ ప్రాపర్టీ రికార్డును తయారు చేయడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీలోని భూమి యజమానులకు ఈ రికార్డు గురించి తెలియజేయుట కొరకు ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు కొక్కరాయపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ చింతల శోభ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం


ఫాతేహాలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడివీధిలో వెలసిన తూగుట్లపల్లి జాగీర్దార్ హజరత్ సయ్యద్‌షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవం శనివారం ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీసయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతపురం, కర్నూల్, గుజరాత్, మహారాష్ట్ర కర్నాటక తదితర ప్రాంతాలనుంచి వేలాది మంది భక్తులు దర్గాను సందర్శించి స్వామి వారికి ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. ఈ ఉరుసు మహోత్సవంలో కర్నూల్ డాక్టర్ తాహీర్‌పీర్‌షా, సిద్దవటం పీఠాధిపతి మహాబూబ్‌పాషా, దాదాపహాడ్ పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌మోయిద్దీన్, సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ, సయ్యద్‌షా తాహీర్ పీరాఖాద్రీలతో పాటు మరికొందరు పీఠాధిపతులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

తూగుట్లపల్లి జాగీర్దార్ హజరత్ సయ్యద్‌షా ఉరుసు మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిలు శనివారం రాత్రి దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా పక్కీర్ల మేళాలతో వారిని దర్గాలోనికి పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆహ్వానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయుడు



పెద్దకుడాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

లింగాల : మండలంలోని పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయ బృందం శనివారం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల పరిధిలోని గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే బోధనతోపాటు క్రమశిక్షణతో విద్యార్థులకు భవితకు బాటలు వేస్తామని వివరిస్తున్నారు. అదేవిధంగా గత ఏడాది ఎన్ఎంఎంఎస్ కింద ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని.. వారికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగేళ్లకు రూ.48 వేల ఉపకార వేతనం అందుకుంటారన్నారు. అదేవిధంగా ఎస్ఎస్‌సీ 2023లో 23 మంది విద్యార్థుకు 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని.. నలుగురు విద్యార్థులు 500 మార్కులకు పైన సాధించి పాఠశాల టాపర్లుగా నిలిచారన్నారు. అంతేకాక పెద్దకుడాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, వారి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో పదిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ల్యాబ్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు అందించడమేకాక బస్సు సౌకర్యంలేని గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ప్రత్యే ఆటో సర్వీసులను ఏర్పాటు చేశారని హెచ్ఎం రామకృష్ణయ్య అన్నారు. పాఠశాలలో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్, ఉదయం సాయంత్రం ఒక గంటపాటు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తామని హామీ ఇస్తున్నారు. పదవ తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల ఫొటోలు, ఎన్ఎంఎంఎస్ కింద ఎంపికైన విద్యార్థుల ఫొటోలతో కూడిన బ్యానర్లు, ఫ్లెక్సీలు తయారు చేయించి రహదారుల పక్కన ఏర్పాటు చేశారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు.